# మిఠాయి పొట్లం

రవిప్రసాద్ చెలమల్లు

నీ తియ్య తియ్యని తేనెల మాటలను,
మనసున మల్లియలంటి ఊసులను
అక్షరాలతో మూటలు కట్టి
అప్పుడెప్పుడో నువ్వు విసిరేసిన పొట్లం -
ఇప్పుడు విప్పి చూసినా,
కళ్ళకు తీపి తెలుస్తూనే ఉంది
మనసును మధురోహల పరిమళం
తాకుతూనే... ఉంది!
నేను నడచి విడిచిన నిన్నల్లో
నా జీవన గమనానికి
నువ్విచ్చిన పరిచయ పత్రం-
ఎవరూ లేని ఏకాంతంలో
నేనొక గర్భస్థ శిశువును అయినప్పుడు
అవే అక్షరాలు నాకు
అమ్మజోల పాట అవుతాయి,
చుట్టూరా చీకట్లు ముసిరినప్పుడు
వెన్నెల వెలుగులు చిమ్ముతాయి!
జీవితం చివరంచు వరకూ...దాచుకుని
చవిచూచుకునే మిఠాయిపొట్లం
మిత్రమా... నీ ఉత్తరం..!!!

★★★

## చిక్కుముడి

### శ్రీనివాసరావు బారు

మంచి చెడులు పంచుకుని ఏళ్లు గడిపిన మిత్రులు
మర్రిమాను కొమ్మల్లా మౌనంగా విడిపోతారు

ఒకరికొకరం అంటూ ఎలుగెత్తిన బంధువులు
పుకారు ఏదో విని పుంజాలు తెంపుకుంటారు

నువ్వు చూపిన మార్గంలో ఎదిగిపోయిన శిష్యులు
ఏరు దాటించిన పడవను ఏమరచి పోతారు

అమ్మ కడుపున పుట్టిన అన్నదమ్ములిద్దరు
ఆస్తుల పంపకంలో ఆజన్మశత్రువులవుతారు

అగ్నిసాక్షిగా ఆత్మలు కలిశాయన్న దంపతులు
కటువుగా కలహించి కనుమరుగైతారు

అపరిచితులను కూడా ఆత్మీయంగా పలకరించమన్న
పెద్దలందరూ
అయినవారు వేరైతే ఏం చేయాలో ఎందుకు చెప్పరు!?

★★★

## వెలుగు పిట్ట

### భమిడిపాటి వెంకటేశ్వరరావు

కిరణాన్ని
కిరీటంగా అలంకరించుకున్న
కిరాయి పక్షి
కొమ్మ చివర్న వాలి...

వాకిలి కంటికి అంటుకున్న
చీకటి కాటుకను తుడుస్తూ
ఆవరణంతా
కలిమి కాంతులను నాటుతోంది..!!

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

భయమెరుంగక జీవింపవలయునంద్రు
వలయు ధైర్యము కష్టముల్ కలిగినపుడు
బెదరి పారిపోవలదు జీవితమునుండి
గమనమాపక ముందుకు కదలవలయు

విడుము భయమంచునెవరు చెప్పిననుగాని
ఎల్లవేళల దాని త్యజింపదగదు
జయమసాధ్యమైన భయము సముచితమ్ము
పరువులెత్తమె సింగంబు పైబడంగ

ప్రొద్దుపొడుపు మొదలు రవి క్రుంకువరకు
మెలకువను నిద్రయందున కలలయందు
కారణము లేక భయమున గ్రాలుచుంట
క్షేమకరమౌనె? నిల్చించు సింగమవదె?

భయము జీవితమ్మునవొక భాగమెపుడు
ఎపుడు మనతోడనుండునదృశ్యమవదు
భీతి లేకుంట శౌర్యజీవితము కాదు
తలప వెఱపును గెలుచుటే ధైర్యమగును

పిఱికితనమున ధైర్యమున్ విడువదగదు
ఎంత ధైర్యమున్న భయమదృశ్యమవదు
వెఱపు ధైర్యము కలిసి జీవించుచుండు
భయమునణచుటే ధైర్యమ్ము ప్రౌఢిమమ్ము

COMMENTS